సాక్షి
తిరుపతి
సోమవారం । 24 । ఫిబ్రవరి । 2025



భూత వాహనం, శుక వాహనంపై ఊరేగుతున్న ఆదిదంపతులు

హర్షిత సూర్యకుమార్

న్యూస్‌రీల్

ప్రశాంతంగా గ్రూప్‌-2 పరీక్షలు



పరీక్షా కేంద్రంలో తనిఖీ చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్ : ఏపీపీఎస్సీ చేపట్టిన గ్రూప్‌–2 మెయిన్స్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఆదివారం ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి 5:30 గంటల వరకు రెండు సెషన్లలో పరీక్షలు జరిపించినట్లు వెల్లడించారు. తిరుపతిలోని 13 కేంద్రాలలో చేపట్టిన పరీక్షలకు మొత్తం 5,801 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా ఉదయం సెషన్‌కు 5,055 మంది, మధ్యాహ్నం సెషన్‌కు 5,046 మంది హాజరైనట్లు వివరించారు. ఏపీపీఎస్సీ నిబంధనల మేరకు అన్ని శాఖల సమన్వయంతో పరీక్షలను విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. ఈ మేరకు పరీక్ష కేంద్రాలను అధికారులతో కలిసి తనిఖీ చేసినట్లు వెల్లడించారు.

ఆదిదంపతుల విహారం



అధికార నందిపై ఊరేగుతున్న స్వామివారు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లి శ్రీపళ్లికొండేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి అధికార నంది వాహనంపై స్వామి, పల్లకిపై అమ్మవారు ఊరేగారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు కార్తికేయ గురుకుల్, ఈఓ లత పాల్గొన్నారు.

పక్షుల కేంద్రంలో సందడి



తెడ్డుముక్కు కొంగలు

దొరవారిసత్రం : నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రంలో వలస విహంగాలను వీక్షించేందుకు ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి సందర్శకులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. గూడబాతులు, నత్తగుల్లకొంగలు, తెల్లకంకణాయిలు, తెడ్డుముక్కు కొంగలు, నీటికాకులు తదితర పక్షుల కిలకిలరావాలను ఆస్వాదించారు. చెరువులో ఈదులాడుతూ పక్షులు చేస్తున్న విన్యాసాలను చూసి పరవశించారు.



సేదతీరుతున్న విహంగాలు

ప్రభల తేజం..
భవుని వైభవం

- కనులపండువగా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు
- విశేష వాహనాలపై విహరించిన ఆదిదంపతులు



సూర్యప్రభ వాహనం, చప్పరంపై ఊరేగుతున్న ఉత్సవర్లు

శ్రీకాళహస్తి : దక్షిణ కైలాసంలో అంగరంగ వైభవంగా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం ఉదయం శ్రీకాళహస్తీశ్వరస్వామివారు సూర్యప్రభ వాహనంపై ఊరేగారు. జ్ఞానప్రసూనాంబ అమ్మవారు చప్పరంపై అధిష్టించి లయకారుని వెంట సాగారు. మూషిక వాహనంపై విఘ్నేశ్వరుడు, చప్పరాలపై శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి, చండికేశ్వరుడు, భక్తకన్నప్ప అనుసరించారు. మంగళవాయిద్యాలు, కోలాటాలు, భజనల నడుమ ఆదిదంపతులు పురవిహారం చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు కర్పూర హారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే రాత్రి సర్వాలంకారశోభితులైన ఆదిదంపతులు చంద్రప్రభ, శుక వాహనాలపై కొలువుదీరి మాడ వీధుల్లో ఊరేగారు. కార్యక్రమాల్లో ఈఓ బాపిరెడ్డి పాల్గొన్నారు.

మూడు కౌంటర్లలో టికెట్ల విక్రయం

మహాశివరాత్రి రోజున స్వామివారి దర్శనానికి స్థానికుల కోసం మూడు కౌంటర్లలో టికెట్లు విక్రయించనున్నట్లు ఈఓ బాపిరెడ్డి తెలిపారు. పట్టణంలోని భక్తకన్నప్ప సదన్, శ్రీప్రసన్న వరదరాజస్వామి అతిథిగృహం, సీఆర్‌ఓ కార్యాలయంలో ఒక్కో రూ.200 చొప్పున 24న ఉదయం 6 నుంచి రాత్రి 7గంటల వరకు, 25న ఉదయం 6 నుంచి సాయంత్రం 5గంటల వరకు విక్రయిస్తారని వెల్లడించారు. భక్తులు ఆధార్ కార్డు అందించి ఆయా కౌంటర్లలో టికెట్లు తీసుకోవచ్చని సూచించారు.

నేడు రావణాసుర - మయూర వాహనసేవలు

శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి రావణబ్రహ్మ వాహనంపై ముక్కంటీశుడు, మయూర వాహనంపై జ్ఞానప్రసూనాంబ అమ్మవారు పురవీధుల్లో విహరించనున్నారు. ఈ క్రమంలోనే9 ఉదయం పరమశివుడు హంసవాహనం, పార్వతీదేవి యాళి వాహనంపై పురవీధుల్లో ఊరేగనున్నారు.

గ్రీష్మితారెడ్డి

నిరుద్యోగుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడింది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల ఓట్ల కోసం అభ్యర్థుల భవితను ప్రశ్నార్థకం చేసింది. ఏపీపీఎస్సీ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయకుండా గందగోళ వాతావరణం సృష్టించింది. గ్రూప్‌–2 మెయిన్స్ పరీక్షల నిర్వహణపై కప్పదాటు ధోరణి అవలంభిస్తూ యువతను అయోమయానికి గురి చేసింది. వాయిదా పేరిట శనివారం అర్ధరాత్రి వరకు యువతను టెన్షన్ పెట్టి నిలువునా వంచించింది. దీంతో చాలామంది ఎగ్జామ్‌కు హాజరుకాలేకపోయారు. వచ్చిన వారు కూడా సక్రమంగా రాయలేక ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నత ఉద్యోగం దక్కుతుందని కోటి ఆశలతో కోచింగ్ తీసుకున్న వారు నిరాశ చెందుతున్నారు. ఇలాంటి దారుణమైన పరిస్థితులు కల్పించిన సర్కారు వ్యవహారశైలిపై మండిపడుతున్నారు.



పరీక్ష కేంద్రంలోకి వెళుతున్న గ్రూప్‌-2 అభ్యర్థులు



నయవంచన

గ్రూప్‌-2 మెయిన్స్‌పై ప్రభుత్వం నాటకాలు

- అయోమయం సృష్టించడంతో అభ్యర్థుల అవస్థలు
- రాజకీయ వికృత క్రీడకు బలైన నిరుద్యోగులు
- వాయిదా టెన్షన్‌తో పరీక్ష సరిగా రాయలేక ఇబ్బందులు
- సర్కారు వ్యవహారశైలిపై వెల్లువెత్తుతున్న ఆగ్రహావేశాలు

తిరుపతి సిటీ : ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం ఆడిన నాటకానికి జిల్లాలో వేల మంది గ్రూప్‌–2 మెయిన్స్ పరీక్షలకు హాజరైన అభ్యర్థులు గందరగోళానికి గురయ్యారు. ఏపీపీఎస్సీ అధికారులు, ప్రభుత్వం మధ్య సమన్వయ లోపం కారణంగా పరీక్ష జరుగుతుందో లేదో అన్న అనుమానంతో శనివారం అర్ధరాత్రి వరకు అభ్యర్థులు మానసికంగా నానా అవస్థలు పడ్డారు. రోస్టర్ విధానంపై స్పష్టత రాకముందే పరీక్షలు నిర్వహించడం వెనుక ఆంతర్యమేమిటో అర్థం కాలేదని అభ్యర్థులు, తల్లిదండ్రులు పలు సెంటర్ల వద్ద గుసగుసలాడుకోవడం కనిపించింది. వాయిదా పడతాయో.. లేక జరుగుతాయో తెలియక ఎంతో మంది అభ్యర్థులు టెన్షన్‌కు లోనయ్యారు. ఆ పరిస్థితుల్లో పరీక్షలను సరిగా రాయలేకపోయామని పలువురు వాపోయారు. ఆదివారం ఈ మేరకు తిరుపతిలోని 13 కేంద్రాలలో నిర్వహించిన గ్రూప్‌–2 మెయిన్స్ పరీక్షలకు కేవలం 86 శాతం మంది మాత్రమే హాజరయ్యారు. పరీక్షల నిర్వహణ, వాయిదా అంటూ అయోమయం, ప్రశ్నపత్రాల సరళిపై గ్రూప్‌–2 పరీక్ష రాసిన అభ్యర్థులు సాక్షితో పలు అంశాలపై స్పందించారు.



అభ్యర్థిని తనిఖీ చేస్తున్న సిబ్బంది



ఆఖరు నిముషంలో పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తున్న అధికారులు



పరీక్ష కేంద్రంలోకి పరుగులు తీస్తున్న అభ్యర్థి

ఆన్‌లైన్‌లో నిర్వహించాల్సింది



గ్రూప్‌–2 మెయిన్స్ పరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహించి ఉంటే బాగుండేది. పారదర్శకంగా ఉండేదని అభ్యర్థులు అందరూ అభిప్రాయపడుతున్నారు. ఆఫ్‌లైన్ ద్వారా నిర్వహించడం అంత శ్రేయస్కరం కాదనిపిస్తోంది. గతంలో ప్రిలిమ్స్ ఆఫ్‌లైన్‌లో నిర్వహించినా మెయిన్స్ పరీక్ష ఆన్‌లైన్‌లోనే నిర్వహిస్తూ వచ్చారు గ్రూప్‌–2 పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు, అధికారుల హడావుడి ఎక్కువగా అనిపించింది. పరీక్ష కేంద్రానికి సుమారు అర కిలోమీటరు దూరంలో స్టాపింగ్ ఏర్పాటు చేసి అక్కడి నుంచి నడుచుకుని రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించి ఉంటే సౌకర్యంగా ఉండేది.

– సువర్ణలత, గ్రూప్‌–2 అభ్యర్థి, తిరుపతి

సరిగా రాయలేకపోయా



నాతో పాటు ఎంతో మంది అభ్యర్థులు గ్రూప్‌–2 పరీక్ష వాయిదా పడుతుందని ఆశించాం. రోస్టర్ రిజర్వేషన్ స్పష్టత వచ్చేవరకు పరీక్షలు నిర్వహించరని భావించాం. ఎమ్మెల్సీ ఎన్నికల నిబంధనలపై ఆలోచించకుండా ఏపీపీఎస్సీ పరీక్ష నిర్వహించింది. పరీక్ష వాయిదా పడుతుందని టెన్షన్‌కు గురై సరిగా రాయలేకపోయా. ప్రభుత్వం పోటీ పరీక్షల హాజరవుతున్న అభ్యర్థులను ప్రతిసారీ ఇలా ఆందోళనకు గురిచేస్తోంది. దీనికి తోడు పరీక్ష వాయిదాపై పరిశీలిస్తున్నాం అంటూ మమ్మల్ని వంచించింది. కానీ, ఏపీపీఎస్సీ అందుకు విరుద్ధంగా పరీక్ష నిర్వహణకు పూనుకోవడం దారుణం.

– శ్రీనివాసులు, గ్రూప్‌–2 అభ్యర్థి, ఎస్వీయూ

అయోమయం సృష్టించారు



గ్రూప్‌–2 పరీక్ష నిర్వహణపై అయోమయం సృష్టించారు. రూ.లక్షలు వెచ్చించి శిక్షణ తీసుకున్నాం. పరీక్ష జరుగుతుందో లేదో తెలియక శనివారం అర్ధరాత్రి వరకు టెన్షన్ పడ్డాం. రోస్టర్ పద్ధతిపై పలు మార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదు. ఏపీపీఎస్సీ అధికారులు, ప్రభుత్వం మధ్య అవగాహ లేకపోవడంతో గందరగోళం సృష్టించారు. ఇలా నిరుద్యోగుల జీవితాలతో ఆడుకోవడం దారుణం. పరీక్షల్లో ఏపీ చరిత్ర, ఇండియన్ ఎకానమీ ప్రశ్నపత్రాలు పర్వాలేదు, కానీ, రెండో సెషన్‌లో జరిగిన ఎకానమీ, సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రశ్న పత్రంతో ఇబ్బంది పడ్డాం. – వినోద్, గ్రూప్‌–2 అభ్యర్థి, ఎస్వీయూ

స్పష్టత రాకుండానే పరీక్షలు



గ్రూప్‌–2 మెయిన్స్ పరీక్ష వివాదాస్పదమవడానికి ప్రధాన కారణం రోస్టర్ విధానం అమలులో స్పష్టత రాకపోవడం. మాలాంటి పేద విద్యార్థులందరం ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని కొన్నేళ్ల పాటు పుస్తకాలకు అత్తుకుపోయి శ్రమించాం. అలాంటిది ప్రభుత్వం రోస్టర్ రిజర్వేషన్‌పై స్పష్టత ఇవ్వకుండా పరీక్షలు నిర్వహించడం దారుణం. పరీక్షలు నిర్వహించారు కానీ రిజల్ట్ విడుదల, పోస్టింగ్‌ల విషయంలో వాయిదాలు వేయకుండా ఏపీపీఎస్సీ సక్రమంగా నిర్వహిస్తుందా అన్నది అనుమానంగా ఉంది. – ఉమేష్, గ్రూప్‌–2 అభ్యర్థి, తిరుపతి

పేద విద్యార్థులకు నష్టమే



పారదర్శకతతో గ్రూప్‌–2 ఉద్యోగాలకు రోస్టర్ విధానం అమలు చేసి తీరాల్సిందే. లేదంటే పేద విద్యార్థులకు నష్టం వాటిల్లే ప్రమాదముంది. రోస్టర్ విధానంపై స్పష్టత వచ్చిన తర్వాత గ్రూప్‌–2 మెయిన్స్ పరీక్ష నిర్వహించి ఉంటే బాగుండేది. ఆదివారం జరిగిన పరీక్ష ప్రశ్న పత్రం శైలి చాలా సులువుగా సాధారణ విద్యార్థి సైతం జవాబులు గుర్తించే విధంగా ఉంది. అయితే రోస్టర్ అమలు చేస్తేనే అర్హులైన అభ్యర్థులకు న్యాయం జరుగుతుంది.

– షణ్ముగం, గ్రూప్‌–2 అభ్యర్థి, తిరుపతి

- తిరుపతి పుట్టిన రోజును విస్మరించిన కూటమి ప్రభుత్వం
- టీటీడీ, కార్పొరేషన్ తీర్మానాన్ని పట్టించుకోని పాలకులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు

ఏదీ ఆవిర్భావ శోభ!

నాడు కళకళ



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయంలో నాటి ఎమ్మెల్యే, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఆధ్వర్యంలో తిరుపతి నగరం పుట్టిన రోజు వేడుకలను అంగరంగవైభవంగా నిర్వహించారు. తిరుపతి నగరం మొత్తం మామిడి, అరటి తోరణాలతో అలంకరించారు. ఆధ్యాత్మిక శోభయాత్రను చేపట్టారు. భక్తజన గోవింద నామ సంకీర్తనలు, భజన మండళ్ల కోలాటాలు, పండరి భజనలు, చెక్కభజనలు, కళాబృందాల లయబద్ధ నృత్యాలు, సకల దేవతామూర్తులు, సప్తమహర్షులు, జగద్గురుల వేషధారణలు, వేదపండితుల మంత్రోచ్చారణలు, ఎక్కడ చూసినా భక్తి చైతన్యమే వెల్లివిరిసింది. గోవిందరాజపురంగా ఏర్పడి.. తిరుపతిగా ఖ్యాతికెక్కిన ఆధ్యాత్మిక రాజధాని తిరుపతి పుట్టిన రోజు సందర్భంగా నగరం మొత్తం కళకళలాడింది.

నేడు వెలవెల



తిరుపతి నగరానికి ఉన్న విశిష్టత ఏ నగరానికీ లేదనేది జగమెరిగిన సత్యం. అటువంటి నగరం పుట్టిన రోజు వేడుకలను నేటి కూటమి ప్రభుత్వం, ఎమ్మెల్యే విస్మరించారు. సనాతన ధర్మానికి మహా పురుషులు తామేనన్ని, హిందుత్వమంటే తమదేనని ఎల్లో మీడియా ద్వారా ప్రచారం చేయించుకుని జబ్బలు చరుచుకునే టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులకు ఆధ్యాత్మిక నగర పుట్టిన రోజు గుర్తురాలేదంటూ.. తిరుపతి ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదేనా మీ హిందూ ధర్మమని మండిపడుతున్నారు.

సాక్షి, ప్రతినిధి తిరుపతి: ప్రపంచంలోనే ఏ నగరానికీ లేనంత గుర్తింపు తిరుపతి నగరానికి మాత్రమే ఉంది. ఆధ్యాత్మిక కేంద్రమైనా తిరుపతికి పుట్టిన రోజు జరుపుకునే అవకాశం ఉంది. సద్గురు శ్రీరామానుజాచార్యులు స్వహస్తాలతో 1130 ఫిబ్రవరి 24న శంకుస్థాపనతో.. నేటి తిరుపతిని నాడు గోవిందరాజపురంగా నామకరణం చేశారు. అప్పటి నుంచి తిరుపతికి పుట్టిన రోజు నిర్వహించేవాళ్లు. పూర్వీకుల తదనంతరం తిరుపతి పుట్టిన రోజును మరిచారు.

నూతన ఒరవడికి శ్రీకారం

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయంలో నాటి తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తిరుపతి పుట్టిన రోజు చరిత్రను తెలుసుకొని నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. కరోనా కారణంగా పుట్టిన రోజు వేడుకలను నిర్వహించలేకపోయినా.. ఆ తర్వాత జన్మదిన వేడుకలను సంప్రదాయంగా బద్ధంగా, అంగరంగవైభవంగా నిర్వహిస్తూ వచ్చారు. శ్రీవారి పాదాల చెంత విస్తరించిన ఈ మహానగరానికి జన్మదిన వేడుకలను నిర్వహించాలని నాటి టీటీడీ పాలకమండలి, తిరుపతి నగర పాలక సంస్థలు తీర్మానం కూడా చేశారు. ప్రతి ఏటా తిరుపతి మహా నగరం జన్మదిన వేడుకలు నిర్వహించాలని గత పాలకులు, అధికారులు నిర్ణయించారు.

తిరుపతి పుట్టిన రోజుకు రాజకీయ గ్రహణం

రెండేళ్ల క్రితం ప్రతిష్టాకరంగా మొదలైన తిరుపతి పుట్టినరోజుకు రాజకీయ గ్రహణం పట్టింది. తిరుపతి గ్రామ దేవత గంగమ్మగుడి పునర్నిర్మాణం పనుల సందర్భంగా బయటపడిన శిలాఫలకం ఆధారంగా 2022 ఫిబ్రవరి 24వ తేదీన తిరుపతి 893వ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. అప్పటి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి చొరవతో టీటీడీ, తిరుపతి నగరపాలక సంస్థల సహకారంతో రాజకీయాలకు అతీతంగా రెండేళ్ల పాటు ఉత్సవాలను నిర్వహించారు. ఎవరు ఉన్నా ఆ ఉత్సవాలను కొనసాగించే లక్ష్యంతో నిరంతరాయంగా నిర్వహించాలని టీటీడీ ధర్మకర్తల మండలి తీర్మానం చేసింది. నగర పాలక సంస్థ కూడా ఉత్సవాల నిర్వహణకు తీర్మానం చేసింది. అది వ్యక్తిగతం, రాజకీయ కార్యక్రమం కాదు కనుక అప్పటి ప్రతిపక్ష పార్టీల వారు కూడా తిరుపతి పుట్టినరోజు ఉత్సవాలను వ్యతిరేంచ లేదు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక తిరుపతి పుట్టినరోజును పట్టించుకునే వారు కరవయ్యారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 21 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 78,110 మంది స్వామివారిని దర్శించుకోగా 30,020 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.39 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

అరాచకాలపై పోరాటం



అనుబంధ విభాగాల అధ్యక్షులతో మాట్లాడుతున్న భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం : కూటమి ప్రభుత్వ అరాచకాలపై రాజీ లేని పోరాటం సాగించాలని వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం పద్మావతిపురంలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. భూమన మాట్లాడుతూ పదవులను బాధ్యతగా స్వీకరించి పనిచేయాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందడుగు వేయాలని సూచించారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా కృషి చేయాలన్నారు. అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నా కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు ఒక్క హామీని కూడా అమలు చేయలేదని విమర్శించారు. ఈ విషయాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని స్పష్టం చేశారు. కూటమి నేతల దౌర్జన్యాలకు భయపడాల్సిన అవసరం లేదని, జగనన్నతోపాటు తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. జగనన్నకు వస్తున్న జనాదరణకు ఆకాశమే హద్దని తెలిపారు. ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేసి మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకునేందుకు తోడ్పాటు నందించాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని నేతలు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీని ముందుకు తీసుకెళ్లాలని కోరారు.

క్లుప్తంగా

21వ రోజుకు చేరిన పశువైద్య విద్యార్థుల సమ్మె



21వ రోజు నిరవధిక నిరసనలో పాల్గొన్న వెటర్నరీ జూడాలు

తిరుపతి సిటీ: ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో పశు వైద్య విద్యార్థుల సమ్మె ఆదివారానికి 21వ రోజుకు చేరింది. ఇప్పటికే పలు విధాలుగా వినూత్న నిరసలు తెలియజేసిన జూడాలు తమ గౌరవవేతనాన్ని పెంచేవరకు సమ్మె విరమించేదిలేదని భీష్మించుకుని కూర్చున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్) : మండలంలోని కరకంబాడి పంచాయతీ తారకరామనగర్‌లో ఆదివారం ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు.. ఐదో వీధిలో నివసిస్తున్న ఇబ్రహీం (43) సెంట్రింగ్ పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఇటీవల కుటుంబకలహాలు తలెత్తడంతో మనస్తాపం చెందాడు. ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు ఎస్‌ఐ అరుణ్‌కుమార్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు తెలిసింది.

పరిపూర్ణం.. తిరుత్సవ సంబరం



పాట పాడుతున్న హరిచరణ్, శిరీష



ఉత్సవానికి హాజరైన విద్యార్థులు

- తిరుపతి ఐఐటీలో ముగిసిన కల్చరల్ ఫెస్ట్
- డీజే నృత్యాలతో విద్యార్థుల జోష్

రేణిగుంట(ఏర్పేడు) : ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీలో విజ్ఞానం మేళవింపుగా నిర్వహిస్తున్న తిరుత్సవ–2025 సాంస్కృతిక సంబరం ఆదివారంతో ముగిసింది. ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కేఎన్ సత్యనారాయణ పర్యవేక్షణలో మూడు రోజుల పాటు ఉత్సాహంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ట్రెజర్ హంట్ అడ్వంచర్ గేమ్‌లో భాగంగా గమ్యస్థానాలను చేరుకోవడంలో ఉత్సుకతను కనబరిచారు. పాప్ కల్చర్, క్విజ్ ఇంటెన్సివ్ పోటీల్లో విద్యార్థుల భాషణ స్పష్టతను పరీక్షించారు. క్రికెట్ ఓ మానియా పోటీల్లో భాగంగా మాక్ ఐపీఎల్ వేలం పాట నిర్వహించారు. ఎస్కేప్ రూమ్, టెక్ హీస్ట్ గేమ్‌లో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి దొంగను పట్టుకునే విధానంపై ఆసక్తి చూపించారు. వివిధ ప్రాంతాల నుంచి వర్క్‌షాపుల్లో పాల్గొన్న ఇంజినీరింగ్ విద్యార్థులు నూతన ఆవిష్కరణల దిశగా అడుగులు వేసేందుకు ఐఐటీ ప్రొఫెసర్లు పలు సూచనలు, విలువైన సమాచారం అందించారు. ఐఐటీ విద్యార్థులు రూపొందించిన ఆలోచింపజేసే విభిన్న చిత్రాలు, పోస్టర్లను క్యాంపస్ అంతటా ప్రదర్శించారు.



విద్యార్థుల గ్రూప్ డిస్కషన్

ఆటలు.. పాటలు.. డ్యాన్సులు

తెలుగు సినీ నేపథ్య గాయకుడు హరిచరణ్, గాయని శిరీషా, ఆకాష్ బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన మ్యూజికల్ ఈవెంట్ ప్రేక్షకులను అలరించింది. స్టేజ్ ముందు విద్యార్థులు ఎంతో హుషారుగా నృత్యాలు చేసి, పాటలకు అనుగుణంగా చప్పట్లు, కేరింతలతో ఫుల్ జోష్‌తో వేడుకకు ముగింపు పలికారు. మిరుమిట్లు గొలిపే విద్యుత్ వెలుగులు, హుషారెత్తించే మ్యూజికల్ సౌండ్స్, పాప్ గీతాలకు తమదైన శైలిలో సుమారు రెండు గంటల పాటు నృత్యాలు చేస్తూ తిరుత్సవ–2025 సంబరాలను పరిపూర్ణం చేశారు.

జర్నలిస్టుల ఆరోగ్య సంరక్షణకు ఆస్టర్ సహకారం

తిరుపతి కల్చరల్: జర్నలిస్టుల ఆరోగ్య సంరక్షణలో ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ ముందుంటుందని ఆ హాస్పిటల్ ఎండీ డాక్టర్ సునందకుమార్‌రెడ్డి, చీఫ్ ఆపరేటింగ్ అధికారి డాక్టర్ శ్రీధర్ తెలిపారు. ఆదివారం ప్రెస్‌క్లబ్ సభ్యులు, వారి కుటుంబ సభ్యులకు ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆస్టర్ నారాయణాద్రి వారి ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 224 మంది జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు ఉచితంగా షుగర్, బీపీ, థైరాయిడ్, కొలెస్ట్రాల్, ఈసీజీ, పీఎఫ్టీ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వృత్తిపరంగా బిజీగా ఉన్నప్పటికీ సమయానికి తినడం, నిద్రించడం తప్పక పాటించాలన్నారు. ప్రముఖ గుండె వైద్య నిపుణుడు డాక్టర్ సుమంతరెడ్డి మాట్లాడుతూ గుండె పరిరక్షణ పట్ల జాగృతలను తెలియజేశారు. అనంతరం ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ వైద్యులను ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ వైద్యులు డాక్టర్ ప్రీతమ్, డాక్టర్ మౌనిక, డాక్టర్ సాయిరాం, తేజ, డాక్టర్ కార్తీక్, డాక్టర్ మధు, డాక్టర్ యశోద, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రెస్‌క్లబ్‌లో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

అధికార నందిపై తేజోవిలాసం



తిరుచ్చివాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తున్న కామాక్షి సమేత శ్రీసోమస్కందమూర్తి

తిరుపతి కల్చరల్: శ్రీకపిలేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో ఐదోరోజైన ఆదివారం రాత్రి శ్రీసోమస్కంధమూర్తి అధికార నంది వాహనంపై కొలువై ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. కోలాటాలు, భజనలు, మంగళవాయిద్యాల నడుమ కోలాహలంగా సాగింది. ఉదయం స్వామివారు తిరుచ్చి వాహనంలో శ్రీకామాక్షి సమేత శ్రీసోమస్కంధమూర్తి పుర వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం ఆలయంలో అర్చకులు స్నపన తిరుమంజనాన్ని వేడుకగా చేపట్టారు. ఎస్వీ సంగీత, నృత్య కళాశాల, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు ప్రదర్శించిన భక్తి సంగీత, నృత్య సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆలయ డెప్యూటీ ఈఓ దేవేంద్రబాబు, ఏఈఓ సుబ్బరాజు, సూపరింటెండెంట్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.



ఉత్సవర్లకు వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు

తల్లిదండ్రులను చూసి వెళ్తుండగా..

- లారీ ఢీకొట్టడంతో కానిస్టేబుల్ మృతి
- మిన్నంటిన తల్లిదండ్రుల ఆర్తనాదాలు
- చిట్టమూరు మండలం ఈశ్వరవాకలో ఘటన



భాస్కర్(ఫైల్)

చిట్టమూరు/నాయుడుపేటటౌన్ : తల్లిదండ్రులకు అవసరమైన సరుకులు తెచ్చి ఇచ్చాడు.. వారితో కాసేపు గడిపాడు. ఆపై విధులకు వెళ్తుండగా గుర్తు తెలియని లారీ ఢీకొట్టడంతో ఓ కానిస్టేబుల్ చనిపోయిన ఘటన ఘటన ఆదివారం వెలుగుచూసింది. వివరాలు.. చిట్టమూరు మండలం ఈశ్వరవాక గ్రామానికి చెందిన పెళ్లకూరు రోశయ్య, వజ్రమ్మ దంపతులకు మూడవ సంతానమైన పెళ్లకూరు భాస్కర్ (42) ఏఆర్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. నాయుడుపేట ఎస్‌ఐ వాహన డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అయితే అప్పుడప్పుడు స్వగ్రామం ఈశ్వరవాకకు వస్తాడు. ఈ క్రమంలోనే ఆదివారం కూడా తల్లిదండ్రులకు ఇంటికి అవసరమైన సరుకులు ఇచ్చి తిరిగి బైక్‌లో వెళ్తుండగా పుదూరు వద్ద గుర్తు తెలియని లారీ ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో కానిస్టేబుల్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలిసి తల్లిదండ్రులు ఇంతసేపు వరకు తమతో ఉన్న కొడుకు కానరాని లోకాలకు వెళ్లాడా ? అంటూ చేసిన ఆర్తనాదాలు మిన్నంటాయి. వృద్ధాప్యంలో ఉన్న తమకు అండగా ఉన్న కొడుకు పోయాక తమ గతేంటని కన్నీరుమున్నీరయ్యారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ బాబీ

నాయుడుపేటటౌన్: మండల పరిధిలోని మేనకూరులో మామిడి కాలువలో ఓ మృతదేహం కొట్టుకు రావడంతో స్థానికులు గుర్తించి ఆదివారం పోలీసులకు సమాచారం అందించారు. సీఐ బాబీ మామిడి కాలువ వద్దకు చేరుకుని పరిశీలించారు. సుమారు 45 ఏళ్ల పైబడి ఉన్న గుర్తు తెలియని వ్యక్తి మామిడికాలువలో స్నానానికి దిగి మునిగి చనిపోయాడా ? లేక వేరే కారణమా ? అనే కోణంలో విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతుడి ఎడమ చేతికి లవ్ గుర్తు ఉన్నట్లు గుర్తించారు. వీఆర్వో శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కన్నీటి సంద్రం

- ఒక్కగానొక్క కుమారుడిని బలితీసుకున్న స్వర్ణముఖి
- కన్నీరుమున్నీరైన కుటుంబీకులు



స్వర్ణముఖి నదిలో ఈతకు వెళ్లి మృతి చెందిన వినీల్

నాయుడుపేట టౌన్: ఒక్కగానొక్క కుమారుడు కుటుంబానికి అండగా ఉంటాడని ఆశపడిన తల్లిదండ్రులకు నిరాశే ఎదురైంది. కుమారుడిని స్వర్ణముఖి నది బలి తీసుకోవడంతో కడుపు కోతే మిగిలింది. ఈ ఘటన మండల పరిధిలోని కూచివాడపాళెం గ్రామ సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం.. చిట్టమూరు మండలం, గునపాటిపాళెం గ్రామానికి చెందిన చిప్పల వెంకటయ్య, కవిత దంపతుల ఒక్కగానొక్క కుమారుడు చిప్పల వినీల్(20) 10వ తరగతి వరకు చదువుకున్నాడు. వారిది నిరుపేద కుటుంబం కావడంతో వినీల్ మేనకూరులోని ఓ పరిశ్రమకు పనికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం గ్రామంలో ఉన్న కొంతమంది స్నేహితులతో కలిసి నాయుడుపేట మండల పరిధిలోని కూచివాడపాళెం గ్రామ సమీపంలో స్వర్ణముఖి నదిలో సరదగా ఈతకు వెళ్లాడు. నదిలోని గుంతలో భారీ ఆగాధంగా ఉన్న విషయం తెలియక అందులో ఇరుక్కుపోయి మునిగిపోయాడు. స్నేహితులు పెద్దగా కేకలు వేయడంతో స్థానికులు అక్కడకు చేరుకుని నదిలో కూరుకుపోయిన వినీల్‌ను బయటకు తీశారు. వెంటనే సమీపంలో ఉన్న గునపాటిపాళెం వైద్యశాల వద్దకు తీసుకెళ్లారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే వినీల్ మృతిచెందినట్టు ధ్రువీకరించారు. వైద్యశాల వద్దకు చేరుకున్న మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు వినీల్ మృతదేహాన్ని చూసి కన్నీటి పర్యంతమయ్యారు. ఆర్తనాదాలతో స్వగ్రామానికి తీసుకెళ్లారు. రాత్రి వరకు కూడా బాధితులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయలేదు.

దారుణం.. ఆరోగ్య రంగం



మాట్లాడుతున్న విశ్రాంత ఐఏఎస్ అధికారి సుజాతారావు



మాట్లాడుతున్న విశ్రాంత ఐఏఎస్ అధికారి పీవీ రమేష్

- బాధ్యతను విస్మరిస్తున్న ప్రభుత్వం
- విశ్రాంత ఐఏఎస్ అధికారి సుజాతారావు

తిరుపతి తుడా : రాష్ట్రంలో ఆరోగ్యం రంగం పరిస్థితి దారుణంగా ఉందని, ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకుండా బాధ్యతను విస్మరిస్తోందని విశ్రాంత ఐఏఎస్ అధికారి సుజాతారావు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాల ఆడిటోరియంలో వేమన విజ్ఞాన కేంద్రం, ప్రజారోగ్య వేదిక, ఎస్వీ మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో «ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్య రంగం–సామాజిక బాధ్యత» అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ దేశంలో ఆరోగ్యం అనేది ప్రాథమిక హక్కుగా మారాలన్నారు. 1983లో మొదటిసారిగా ఆరోగ్య విధానం ప్రకటించారని తెలిపారు. ఈ క్రమంలో దశలవారీగా వచ్చిన మార్పుల వల్ల ఆరోగ్యం అనేది ప్రాథమిక హక్కుగా లేకుండా పోయిందన్నారు.

పేదలకు వైద్యం కరువు

ప్రధానంగా మన రాష్ట్రంలో పేదలు సరైన వైద్యం పొందలేని దుస్థితిలో ఉన్నారని స్పష్టం చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం బాధ్యతారహితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. చిత్తూరులోని ప్రభుత్వాస్పత్రిని అపోలో వారికి అప్పగించడం, ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో 11 మెడికల్ కాలేజీలు నిర్వహిస్తామని ప్రకటించడం, క్యాపిటేషన్ ఫీజు పేరిట రూ.కోట్లు వసూలు చేయడం సమర్థనీయం కాదని మండిపడ్డారు. అభివృద్ధి అంటే రోడ్లు వేయడం, కార్లు కొనడం, జీడీపీ లెక్కలు చూపడం కాదని ఆరోగ్యంతో జీవించడమేనని వివరించారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ పీవీ రమేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలందరికీ నాణ్యమైన వైద్యం అందించాలని కోరారు. ఇంజినీరింగ్ తరహాలో వైద్యవిద్యను అమ్మకానికి పెట్టడం సరికాదని తెలిపారు. కార్యక్రమంలో స్విమ్స్ డీన్ అల్లాడి మోహన్, ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ పీఏ చంద్రశేఖర్, రుయా సూపరింటెండెంట్ రవి ప్రభు, వైస్ ప్రిన్సిపల్ డి. సత్యనారాయణ మూర్తి, ఐఎంఏ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ శ్రీహరిరావు, వేమన విజ్ఞాన కేంద్రం ప్రధాన కార్యదర్శి మల్లారపు నాగార్జున, డాక్టర్ రవీంద్ర, ముఖేష్, ప్రసూన పాల్గొన్నారు.

నేత్ర పర్వం.. స్వర్ణ రథం



గజవాహనంపై దర్శనమిస్తున్న శ్రీమన్నారాయణుడు



హనుమంత వాహనంపై వేంకటాద్రి రాముడి అలంకరణలో విహరిస్తున్న స్వామివారు



స్వర్ణరథంపై గోవింద నామస్మరణల నడుమ ఊరేగుతున్న దేవదేవేరులు

- హనుమంత, గజ వాహనాలపై శ్రీహరి దివ్యవిలాసం

చంద్రగిరి: శ్రీదేవి, భూదేవి సమేత శ్రీహరి స్వర్ణరథంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజైన ఆదివారం ఉదయం శ్రీనివాసుడు హనుమంత వాహనంపై శ్రీకోదండరాముడి అవతారంలో భక్తులకు అభయమిచ్చారు. అంతకు ముందు శ్రీవారికి వసంతోత్సవం నిర్వహించారు. సాయంత్రం స్వామి, దివ్యాభరణ, పట్టుపీతాంబరాలతో అలంకృతులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీహరి ఉత్సవర్లను స్వర్ణరథంపై అధిష్టింపజేసి అర్చకులు సంకల్ప పూజలను నిర్వహించారు. అనంతరం ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మితో పాటు టీటీడీ అధికారులు స్వామి వారి సర్కారు హారతిని అందుకున్నారు. స్వర్ణ రథానికి ఏర్పాటు చేసిన తాడును టీటీడీ అధికారులు, స్వామి స్వర్ణ రథోత్సవానికి హాజరైన భక్తులు గోవింద..గోవిందా... అంటూ ముందుకు కదిలించారు. రాత్రి శ్రీమన్నారాయణుడు అలంకరణలో గజ వాహనంపై విహరిస్తూ భక్తులకు అభయమిచ్చాడు. ఏఈఓ గోపీనాథ్, సూపరింటెండెంట్‌లు వెంకటేష్, చెంగల్రాయులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఆగమ సలహాదారుడు మోహన రంగాచార్యులు, అర్చకులు బాలాజీ రంగాచార్యులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలలో నేడు

శ్రీనివాస మంగాపురం శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడో రోజు అయిన సోమవారం స్వామి వారు ఉదయం సూర్య, రాత్రి చంద్రప్రభ వాహనాలపై ఊరేగనున్నారు.